# ఉద్యోగ విజయాలు

రామారావు లక్ష్మణరావు ఇద్దరూ అన్నదమ్ములు. ఇద్దరూ వేర్వేరు ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. ఇద్దరూ తమ ఉద్యోగ లక్షణాలను బాగా ఆకళించుకొన్నారనటానికి సాక్ష్యం—వాళ్ళిద్దరూ సాధించిన ఘనవిజయాలే! వాళ్ళిద్దరూ చేస్తున్న ఉద్యోగాల్లో వాళ్ళు సంపాదిస్తున్నంతగా ఇంకెవరూ సంపాదించ లేక పోతున్నారు కూడానూ!

రామారావు, లక్ష్మణరావుల ఉద్యోగ విజయాలను పురస్కరించుకొని ఆ వూళ్లో వాళ్ళు-వాళ్ళ ఇద్దరికీ సన్మానం చేయాలనుకొన్నారు. ఆ రోజున ఊర్లో చాలామంది ప్రముఖులు, దుర్ముఖులు, పురజనులు, హరిజనులు, ఇంకా వగైరా వగైరా వాళ్ళందరూ ఆ సన్మాన సభకు వచ్చారు.

ముందు మంత్రిగారు, ఆ తర్వాత చైర్మన్‌గారు, ఆ తర్వాత ప్రెసిడెంట్ గారు తర్వాత వాళ్ళూ వీళ్ళూ అందరూ మాట్లాడటం ప్రారంభించిన అరగంటకు ఉపన్యాసం ఆపేసారు—అందరూ ఇంతసేపు మాట్లాడినా సారాంశం మాత్రం ఒకటే—అన్నదమ్ములిద్దరూ అద్భుతమైన విజయం సాధించటం ఆశ్చర్యం అని!

తమకు జరిగిన సన్మానానికి సమాధానం ఇస్తూ రామారావు తనకు తన వృత్తిపట్ల ఉన్న దీక్ష, గౌరవం ఇవే తన విజయానికి కారణమన్నారు. పైపెచ్చు తన అందరూ ఎన్నో రకాల సహాయం చేసనందుకు కృతజ్ఞతలూ చెప్పారు.

లక్ష్మణరావు సమాధానం ఇవ్వట మొదలుపెట్టాడు — "ఏ ఉద్యోగంలో అయినా విజయం పొందాలంటే దాని చిట్కా ఒకటే—కష్టపడి పనిచేయటం ఇది మా అన్నగారు రామారావుగారు చెప్పనే చెప్పారు. ఇంకోటి నేను చెబుతాను—ఉద్యోగం వెతుక్కోవటంలో మెలుకువ చూపిస్తే మరీ విజయవంతం అవడానికి అవకాశం వుంది!—ఈ రెండూ నేను చేశాను!!"

సభలోంచి ఎవరో అడిగారు. "విశదీకరించండి!" అంటూ—

లక్ష్మణరావు తడుముకోకుండా చెప్పాడు. "మా అన్నగారు డాక్టరు. పదిమందికీ రోగాలు వస్తే కుదర్చటానికి డిస్పెన్సరీ పెట్టారు. పదిమందికీ మా అన్నగారంటే నమ్మకం ఉంది!—నాకు మా అన్నగారంటే నమ్మకం ఉంది— అందుకే మా అన్నగారి డిస్పెన్సరీ పక్కనే కట్టెల అడితీపెట్టాను!—ఇదే నా వ్యాపార విజయానికి రహస్యం!"

—సభలోని వారంతా ఇంకా తెల్లపోతూనే ఉన్నారు ఆ సమాధానానికి!!

—పాలకోడేటి సత్యనారాయణరావు.